# ప్రచార సాధనాలు - సాహిత్యం

వి. రతన్‌ప్రసాద్

ఈ సాహిత్యం అనేది పుస్తకం ద్వారా చదవచ్చు, మాటల ద్వారా వినవచ్చు. సాహిత్యానికి భాషకూ అవినాభావ సంబంధం ఉంది. మనకు తెలుగులో ఎన్నో అక్షరాలున్నాయి. అఆ, ఇఈ, అం, అః అని మైక్‌లో అనేస్తే దాని అర్థం ఏమిటో తెలియక తెల్లబోతారు కాని ఆ అక్షరాల్నే ఏర్చి కూర్చి మీ ముందు మాట్లాడితే మీరు విని ఆనందిస్తారు. ఇదే భాషంటే—ఇదే సాహిత్యమంటే, మనిషిలో సంస్కారం సభ్యత ఉన్నట్టే. భాషలో భావోద్రేకం కనిపిస్తే—వినిపిస్తే అదే సాహిత్యం అని నా ఉద్దేశం. అసలు సాహిత్యం అనేదానికి గొప్ప సాహిత్యము, బీద సాహిత్యం అనేది లేదు. 'సూదిలో దారం సందులో బేరం' ఇది సాహిత్యం కాదా! వివిధ భారతి (వాణిజ్య) ప్రచారం వారి—పుష్టికరమైన ఆహారానికీ, ఉల్లాసమైన విందులకూ గ్లూకోజ్ బిస్కట్లే వాడండి ఇందులో సాహిత్యం ఉంది.

మీరు ఉదయం వస్తానని రాలేదేమండి—అని ఒకరు అంటారు. దాన్నే మరొకరు—'అగ్గో! ఏందీ పొద్దుగల వస్తనన్నరు! యాది మర్చినార్' అని ఒకళ్లు అంటారు. మామూలు మాటల్లో కూడా సాహిత్యం ఉంది. అంతేగాని పండిత, కవి గోష్ఠులలో చదివేది మాత్రమే సాహిత్యం అంటే నేను ఒప్పుకోలేను.

అయితే ఈ సాహిత్యం అనేది—ప్రచార సాధనంగా ఎందుకు మలుచుకోవలసి వచ్చిందో మనవి చేస్తా. అనాదిలో ఉన్న మనిషి అనాగరికుడు. మన మంతా చరిత్రలు చదువుతున్నప్పుడు ఇప్పుడు మనం ఎంత ప్రగతిని సాధించామో అనిపిస్తుంది. అనాడు మనుషులు జంతు చర్మాలు వంటికి కట్టుకునే వారు. ఈనాడు విలువైన దుస్తులు ధరిస్తున్నారు. ఇలాగే ప్రతిదాంట్లోనూ నాటికీ నేటికీ ఎంతో వ్యత్యాసం ఉంది. మనిషి అవసరాలు మారుతున్నాయి. నాగరికత మారుతోంది. మారుతున్న నాగరికతలో తన అవసరాలకు తగ్గట్టుగా మలుచుకోవడానికి ప్రచారం ఎంతైనా అవసరం. కొంచెం వివరంగా చెప్తాను. ఇవాళ మన దేశంలో ఎన్నో సమస్యలు ఎంతో మందిని పట్టి పీడిస్తున్నాయి. నిరుద్యోగ సమస్య, ఆహార సమస్య, కత్తిల సమస్య ఇలా ఎన్నో. ఈ సమస్యల్ని ప్రజల దృష్టికి తెచ్చి పరిష్కారాన్ని తెలియజెప్పడానికి ప్రభుత్వ యంత్రాంగం ఎన్నో రకాల ప్రయత్నాలు చేస్తూ ప్రచారం చేస్తోంది. అందులో పత్రికలు, బుర్రకథలు, సినిమా, రేడియో, ఆయా సాధనాన్ని బట్టి మన సాహిత్యాన్ని అందుకు అనుగుణంగా మర్చుకోవలసి ఉంటుంది. టెలివిజను ఇంకా మనకు అందుబాటులో లేదుగాని అది మంచి ప్రచార సాధనం.

రేడియో అసంఖ్యాకంగా శ్రోతలు వింటూ ఉంటారు. అందులో ఎక్కడికంటే అక్కడికి—పొలాలకు—చాకి రేవుల కాడ తీసుకుపోవడానికి వీలుగా ట్రాన్సిస్టర్స్ రావడంవల్ల శ్రామికులు కూడా వినే వీలు కలుగుతోంది.

రేడియో వినేవాళ్లు చదువు వచ్చినవాళ్లే కాకపోవచ్చు. చదువుకోని వాళ్లకు అర్థం అయేలా భాషను—సాహిత్యాన్ని ప్రయోగించవలసిన బాధ్యత రచయిత మీద ఉంటుంది.. అయితే ''ఇవాళ మన దేశంలో పిల్లలు ఎక్కువయిపోయారు. సమస్యలు

ఎక్కువయిపోయాయి అందుకే మీరంతా ఆపరేషన్లు చేయించుకోండి" అని చెప్పినా, రాసినా అది సాహిత్యమే అనిపించుకుంటుంది.

అయితే చెప్పేవిధంగా చెప్పితే ఆ సాహిత్యం రాణిస్తుంది. రేడియోలో-చిన్నక్క ఏకాంబరం, బాలయ్యల విషయంలోకివద్దాం. ఓరోజు చిన్నక్క మామూలుగా కాకుండా కొంచెం ఆలశ్యంగా వచ్చింది ఎప్పుడొస్తుందా! ఎప్పుడు పోట్లాటవేసుకుందామా అని ఎదురుచూస్తున్న ఏకాంబరం "ఇంత ఆలశ్యం చేసేవేం చిన్నక్క పో. నీతో మాట్లాడను" అంటాడు "అదికాదు ఏకాంబరం-మా ఇంటికేమో చుట్టాలువచ్చారు. చుట్టాలు బెడ్డింగ్ చుట్టల్లా ఓమూల పడి ఉన్నారు వారి పిల్లలే ఏకాంబరం ఏంచెప్పను. బ్రహ్మరాక్షసులు—మా ఇల్లు పీకి పందిరేసారు.

"పందిరివేస్తే చల్లగా ఉంటాదిలే చిన్నక్క".

"అవును నీకంతా వేళాకోళంగా ఉందిలే ఏకాంబరం."

"కాఫీపొడుంలో పంచదార కలిపేసారు. బియ్యంలో కందిపప్పు కలిపేసారు. సోఫాలు బ్లేడుతో కోసేసారు. వాళ్ళమ్మ నాన్న కొట్టినా వినిపించుకోవటంలేదు. "అయ్యో చిన్నక్క నీకు ఎంతకష్టం వచ్చింది". నిజమే పిల్లలున్న తలిదండ్రులు పరాయి ఇంట్లోనే ఇంత చికాకులు పడుతూంటే ఇళ్ళలో ఇంకెంత చికాకులు పడుతుంటారో" అని జాలిపడతాడు ఏకాంబరం. అంతలో బాలయ్యవచ్చి "ఒక్క చిన్నక్క ఇంట్లోనే కాదు చాలా ఇళ్లలో చర్విత చర్వణంగా జరుగుతోందని అసలు పిల్లల్ని ఎలా పెంచాలో ఎందరుంటే అలా పెంచగలం మొదలగు విషయాలు చెప్తాడు. ఈ విధంగా కట్టె కొట్టె తెచ్చే అనే పద్ధతి కాకుండా చదువురానివాళ్లకు సంస్కారం లేనివాళ్లకూడా అర్థమయేలా చెప్పడం జరుగుతుంది. ఇది ఒకరకమైన ప్రక్రియ. ఇలాగే కొంత మందికి పాటలంటే ఇష్టం చాలామందికి నాటకాలు వినడం అంటే ఇష్టం. ఇటీవల—ఆకాశవాణివారు నిర్వహించిన కుటుంబ నియంత్రణ నాటిక పోటీలో ప్రథమ బహుమతీ వచ్చిన ఓ నాటిక ఇతివృత్తం ఇది. కుటుంబాన్ని ఈదలేక 24 గంటలూ తాగి ఆ మత్తులో కష్టాల్ని మరిచిపోవాలని చూస్తాడు. పెద్ద కొడుకు ఓరోజు తానూ కల్లు దుకాణానికి వస్తాడు నువ్వెందుకొచ్చావని అడిగితే తండ్రి, ఈ కష్టాలు మర్చిపోయేందుకు నేనుకూడా నీలా తాగడం నేర్చుకుందామని అంటాడు. తండ్రి చాలా బాధపడతాడు. ఇంటిపరిస్థితి అంతా చెప్పి—"నాన్నా అమ్మ ఏం చేస్తుందో తెలుసా! ముందు రూపాయి తీసుకుని—తర్వాత చంటిపిల్లాడ్ని తీసుకుంటుంది" అంటే బిచ్చగాళ్ళకు చంటివాడ్ని అద్దెకు ఇస్తుంది. చాటలో పడుకోబెట్టుకొని వాడ్ని గిల్లీ మరీ ఏడిపించి డబ్బు అడుక్కొని, సాయంత్రానికి శోషతో సొమ్మసిల్లి పోయిన పిల్లాడ్ని ఇంటో రూపాయి చేతిలో పెట్టి వెళ్లిపోతున్నారట. ఆ రూపాయితో ఇన్ని గంజినీళ్లు పొంగించి—ఇంత మందికి సర్దుతోంది అన్నమాట. ఓరోజున అ చంటివాని శవం అప్పగిస్తారు తల్లికి. ఇది హృదయ విదారకమైన సన్నివేశం. వినే శ్రోతల గుండెల్ని పిండుతుంది. కాబట్టి ఇలా ప్రచారం చేయడానికి 'సాహిత్యం' చాలా ముఖ్య పరికరమైన విషయంగా తీసుకుంటున్నాము. కాని ఆ సాహిత్యం పదిమందికీ ఉపయోగపడే విధంగా ఉండాలి. అప్పుడే సార్థకత. పాటలంటే ఇష్టమున్నవారు పాటల్లో చెప్పవచ్చు. భాషరాని వాళ్లకు రానట్టుగానే చెప్పవచ్చు. ఇదంతా సామాన్యులకు. అంతేగాని సాహిత్యం అన్నాము కనక, సాహిత్య పరంగా ప్రచారం చెయ్యాలి అన్నారు కనుక అయిదయిదు కిలోల బరువున్న మాటల్ని ఉపయోగించాలనీ, ఆమాటలకోసం అయిదేసి రోజులు అర్థాలు వెతుక్కోవలసిన అవసరం రావాలి అనుకోవడం అపోహ.

# ప్రచారసాధనాలు - సాహిత్యము

పండా శమంతకమణి

ప్రచార సాధనాలు - సాహిత్యం - అనేది రెండు రకాలు-సాహిత్యాన్ని ప్రచారం చేసే సాధనాలు-ప్రచార సాధనాలకి సాహిత్యాన్ని ఉపయోగించుకోవడం-మొదటిసారి వినగానే రెండూ ఒకటిగానే చటుక్కున అనిపిస్తాయి. కాని సరిగ్గా చూస్తే-ఆ రెండింటిలోనూ చాలా తేడా ఉంది. సాహిత్యాన్ని ప్రచారం చేసే సాధనాలని పరిశీలిస్తే అవి చాలా ఉన్నాయి. అసలు ఏ కళకైనా గుర్తింపు ఉంటేనే అది రాణిస్తుంది. సరైన గుర్తింపు లేని కళ రాణించడం అంటే అంత సాధ్యంకూడా కాదు ఎందుకంటే ఏ కళఐనా ఏ విషయమైనా-దానికి పదుగురి మెప్పు అవసరం సాహిత్యాన్నే తీసుకుంటే, దీనికీ అదే వర్తిస్తుంది. సాధారణంగా మనసు స్పందించినప్పుడు రచన చేయడం జరుగుతుంది. వృత్తిరీత్యా, తప్పనిసరి అయినప్పుడుకూడా "బలవంతపు బ్రాహ్మణ్యం" రచనలు చేయడంకూడా జరుగుతుందనుకోండి. అయితే ఆ బలవంతంగా రచించడం అనేది ఆ వ్యక్తి రచనకి పదిమందిలో ఒక గుర్తింపు, విలువా కలిగినప్పుడే కలుగుతుంద. కనుక అటువంటి రచనల గురించి కాదు నేను చెప్పడం మనసు స్పందించి రచించినప్పుడు ఆ రచన రచయితకి మానసికంగా తృప్తిని ఇస్తుంది తను సృష్టించిన ఆ రచనని, తనకు నచ్చిన ఆ రచనని తనకు తెలిసిన, తెలియని వారికి కూడా చూపించాలని, వారూ చదివి ఆనందించాలనే కోరిక కలగడం సహజం. తనకోసమే రాసుకుని ఆ రచనని తను చదవడానికి మాత్రమే పరిమితం చేసుకోగలిగితే ఆ వ్యక్తి నిస్సంగుడౌతాడు నూటికి 99 మంది-ఆ మాటకొస్తే నూరుగురూకూడా తమ రచనకు తగిన గుర్తింపు, ప్రచారం, ఆదరణ లభించాలనే కోరుకుంటారు. సాహిత్యమేకాదు, ఏ లలితకళైనా సరే అది పదిమందిలో ప్రచారం పొందడంద్వారా, ఆ కళ అభివృద్ధి పొందడానికి వీలవుతుంది. నలుగురి ప్రశంసా, సద్విమర్శలు, ఆ రచనల గురించి రచయిత విమర్శనాత్మకంగా పరిశీలించడమేకాకుండా, లోపాలనిపించినవాటిని దిద్దుకుని, తరువాతి రచనలో ఆ లోపాలు రాకుండా ఉండేటట్లు జాగ్రత్తపడడానికి అవకాశముంటుంది. అలా ఒక రచననుండి మరొక రచన స్థాయి పెరిగి పరిణితి నందుకోగలుగుతుంది. ఆ కళ అభివృద్ధి పొందుతుంది.అంటే ఏ కళఅయినా సరే దానికి సరియైన ప్రచారం కలుగుతే, అది ఆ కళాకారుడిలో యింకా ఉత్సాహాన్ని కలిగించి, యింకా మంచి కళాఖండాలు సృష్టించాలనే ప్రోత్సాహాన్ని encouragement ని యిస్తుంది. ప్రోత్సాహం, encouragement, inspiration ని మించిన సాధనం కళాభివృద్ధికి మరొకటి ఉండదుకదా!

సాహిత్యానికి ప్రచారం ఎప్పుడైతే అవసరం అనుకున్నామో-ఆ ప్రచారానికి సాధనాలు ఏమిటి అనేది వెంటనే కలిగే ప్రశ్న. దానికి కన్పిస్తున్న ముఖ్యసాధనాలు సినిమా, రేడియో, పత్రికలు, సాహితీ సభలు, సమావేశాలు. ఈ సాధనాలు అన్నీ తమ తమ పద్ధతులద్వారా సాహిత్యానికి తగిన ప్రచారం సమకూర్చగలవు. సినిమా, రేడియో, పత్రికలు, సాహితీ సభలు, సమావేశాలు-ప్రజల్లోకి అతి సన్నిహితంగా వెళ్లగలిగే వాటి స్థానాన్ని బట్టి ఈ వరసలో అంటున్నాను. మనదేశంలో నిరక్షరాస్యులు ఇంకా ఎక్కువసంఖ్యలోనే ఉన్నారు. అక్షరాస్యుల్ని నిరక్షరాస్యుల్నికూడా సమానంగా ఆకర్షించి, ఆకట్టుకో

గలిగేది సినిమా, నాటకం-వంటివి-అంటే-కళ్ళకు కన్పించే సాధనాలు. సినిమా నాటకం బుర్రకథ వంటి వాటిలోని సారాన్ని వారివారి గ్రహణశక్తిని బట్టి అర్థం చేసుకోగలుగుతారు. "కావ్యేషు నాటకం రమ్యం"-అన్నారు. ప్రాచీనకాలంలో, నాటకాలే ఉన్నతశ్రేణి దృశ్య ప్రక్రియలుగా ప్రచారంలో ఉన్న కాలంలో సంస్కృతి ధర్మాలకి చెందిన భారత భాగవతం, రామాయణం మొదలైన వాటిని వివిధ నాటకాలుగా చూసి పండితులు అందులోని పాండిత్య ప్రకర్షకి ఆనందిస్తే, పామరులు ఆ నాటకంద్వారా చెప్పదలుచుకున్నదాన్ని సునాయాసంగా గ్రహించగలిగేవారు.

నాటకం బలమైన ప్రచారసాధన—"ప్రాచీనకాలం నుండి సాహిత్యం ఇచ్చే సందేశాన్ని ప్రచారం చేసే ఒక బలమైన సాధనంగా నాటకానికి ప్రముఖస్థానం ఉంది—అనడానికి ప్రాచీన నాటకంలో సునిశితంగా, విపులంగా నిర్దేశింపబడిన నాటక లక్షణాలే నిదర్శనాలు. నాటకం నిరక్షరాస్యులకు కూడా నీతిదాయకమైన సందేశాన్ని యివ్వగలదని భావించే కాబోలు నాటకంలో ఆయా పాత్రలకి అనుగుణమైన భాష వాడటం కూడా జరిగింది. ఈ అభిప్రాయం ఆధునిక యుగంలో మరీ బలపడి నాటకాన్ని బలమైన ప్రచార సాధనంగా ఉపయోగించడానికి ప్రయత్నించారనడానికి 'కన్యాశుల్కం'—ఈ మధ్యలో వచ్చిన N. G. O. మొ॥ నాటకాలే నిదర్శనాలు. అంటే సమకాలీన సమస్యల్ని ఎత్తి చూపించి, పరిష్కార మార్గాన్ని చూపించాలని తపించిన రచయిత నాటకాన్ని తను సృష్టించే సాహిత్యానికి ప్రచార సాధనంగా స్వీకరించాడు అని నిర్ణయించ వచ్చును. నాటకం ద్వారా సందేశాత్మకమయిన సాహిత్యాన్ని యిచ్చి చైతన్యాన్ని కలిగించడానికి ప్రయత్నించడం ఈ నాటి నాటకాల్లో ఎంత వరకు కనిపిస్తోంది అంటే చాలావరకు. ఈనాడు సమకాలీన సమస్యల్ని తీసుకుని సామాజికుడి ముందు "ఇవిగో ఇవీ సమస్యలు—వాటికి పరిష్కార మార్గం ఇది"—అని నాటకం ద్వారా చూపించడంలో చాలా వరకూ కృతకృత్యు డౌతున్నాడనే నిస్సందేహంగా చెప్పవచ్చును.

నాటకాల స్థానాన్ని క్రమంగా సినిమా ఆక్రమించుకుంటోంది. ఈనాడు ప్రజల్లోకి చొచ్చుకుపోయే, ఈ కనిపించే సాధనాల్లో సినిమా అతిముఖ్యమయింది తరవాత చెప్పాల్సింది రేడియో. సినిమా లాగే రేడియో వినడానికి కూడా అక్షరాస్యులు అవునా కాదా అనే బాధలేదు రేడియో అంటూ, మోగుతూంటే—అది వద్దన్నా మన చెవుల్లోకి దూరి, మనసుకు పట్టేస్తుంది. అనేక వర్గాల వారికి కార్యక్రమాలు ప్రసారమౌతుంటాయి — ఉదాహరణకి మధ్యాహ్నపు వేళలో ప్రసారమయ్యే కార్మికుల కార్యక్రమాలు, సాయంత్ర వేళ వ్యవసాయదారుల కార్యక్రమం, స్త్రీల కార్యక్రమం, కుటుంబ నియంత్రణ ప్రచారానికై కార్యక్రమాలు—ఇలా రకరకాల కార్యక్రమాలు ఆయా శ్రోతలకోసం ఉన్నాయి. వాటి ద్వారా ఆయా వర్గాల వారికి వివిధ రకాలైన రచనల్ని వినిపించాలి అనే ఒక నిర్ణీత పద్ధతిలో రేడియో కార్యక్రమాలు రూపొందించడం అనివార్యం. కనుక సాహిత్యం ప్రచార ప్రక్రియలలో బంధింపబడటం తప్పనిసరి అవుతుంది

ఇక, పత్రికలకు ప్రచారసాధనాలుగా సాహితీ రంగంలో ప్రముఖ స్థానం ఉంది. కాస్త చదువుకున్న వారెవరైనా ఏరకమైన వార్త చదవాలన్నా, ఏ రకమైన రచన చదవాలన్నా, పత్రికల్లో చదవడం ఒక్కటే మార్గం ప్రచార సాధనాల్లో సాహిత్యం Publish అయ్యే ప్రక్రియ అవడంవల్ల పత్రికలకి తాత్కాలికమైన ఉనికి మాత్రమే కాకుండా శాశ్వతమైన భద్రతనికలిగి, తరాలవారిగా ప్రజలకిఉపయోగకరంగాఉండే అవకాశం ఏర్పడుతోంది. ఇలా ఆధునిక యుగంలో ముఖ్య ప్రచారసాధనాలుగా సాహిత్య

ప్రచారానికి ఎలా తోడ్పడతాయో తెలుసుకుంటున్నప్పుడే గమనించాల్సిన విషయం ఉంది. అదేమిటంటే మనిషి సంఘజీవి-కనుకనే తను సృష్టించే సాహిత్యానికి ప్రచారం, నలుగురి గుర్తింపూ కావాలనుకుంటున్నాడు అలా ఎప్పుడయితే, తనని రచయితగా నలుగురికీ పరిచయం చేసుకుంటున్నాడో అప్పుడే ఆ నలుగురిపట్లా అతనికి బాధ్యత పెరిగిపోతోంది అతను వినిపించే రచనలు చదివిన వారి మీద అవి తమ ప్రభావాన్ని చూపెడతాయి - తను వ్రాసింది నలుగురినీ ఎప్పుడయితే ప్రభావితుల్ని చేస్తుందో, అప్పుడే ఆ ప్రభావం ఆరోగ్యకరమైందిగా ఉండి, వారిని సక్రమమైన మార్గంలో నడిపించ గలిగేదిగా చూడాల్సిన బాధ్యత రచయితలకు ఏర్పడుతోంది. కనుక, అతను వ్రాసే రచనలు ఎంత అతనికోసం వ్రాసుకున్నా నలుగురిలోకి తీసుకు రావాలి అనుకున్నప్పుడు - ఆ రచన ఆ నలుగురికీ ఆరోగ్యకరమైన ఆనందాన్ని కలిగించేదిగా ఉంచటం అతని కనీస బాధ్యత. ఇదే నియమాన్ని చలన చిత్రాలు కూడ పాటించాల్సి ఉంటుంది. ఏ రచన అయినా అది కరుణమైనా, సంతోషమయినా ఆశ్చర్యమయినా ఆ రచన ద్వారా చివరకు సామాజికులో స్థాపించేది ఆనందాన్ని మాత్రమే. కరుణరసం అయినా సరే దాన్ని చూస్తూ ఆ కరుణ రసాస్వాదనంలో ప్రేక్షకులు లీనమైపోయి, సానుభూతితో,దుఃఖంతో హృదయాలు బాధతో సుడులు తిరిగినా దానినుండి వారికి చివరకు కలిగేది రసానందమే, కాబట్టి రచన ద్వారా కలిగించే ఈ ఆనందం, సంతృప్తి ఎలా ఉండాలి? ఆనందంకూడా ఆరోగ్యకరంగా ఉండాలి. ఆ ఆనందంనుండి ఉత్తేజం లభించి, అది మనిషి శ్రేయస్సుకి, సమాజ శ్రేయస్సుకి, పురోభివృద్ధికి తోడ్పడ గలిగేదిగా ఉండాలి. అప్పుడే రచన వలన కలిగిన రసానందం సార్థకమై, ఆ రచన, తద్వారా రచయిత ధన్యులౌతారు - సమాజాన్ని, మనిషిని ఒక మంచి మార్గంలో ముందుకు నడిపించిన వారౌతారు. అంతేకాని ఆ ఆనందం మత్తు మందు ఇచ్చినట్టు, మగత గొల్పి మనస్సును మేధను జోకొట్టి, మాంద్యాన్ని, ఊహాగానాల్ని, కలల్ని పెంచేదిగా ఉండకూడదు. మనిషిని క్రమంగా జడుణ్ణి చేయకూడదు. ఇదే సూత్రం సినిమాకీ వర్తిస్తుంది. వ్యాపారకళ అయినందువల్ల సినిమా వ్యాపార రీతిలోనే సాగినా, కేవలం లాభం కోసమని. డబ్బు కోసమని క్షణికమైన, చవుకబారు సాహిత్యాన్ని అందులో ప్రవేశపెట్టి ప్రజల మనసుల్ని కలుషితం చేయకూడదు. సమాజ శ్రేయస్సుని కూడా తప్పని సరిగా దృష్టిలో పెట్టుకుని సినిమాలో సాహిత్యాన్ని రూపొందించుకోవడం ఎంతైనా అవసరం.

ఇకపోతే, సాహిత్య సభలూ సమావేశాలూ కూడా ఒక విధంగా ప్రచార సాధనాలే అనవచ్చును. సదస్సులు సమావేశాలు ప్రజలలో ఉత్తేజాన్ని కలిగిస్తాయి. వివిధ సాహిత్య ప్రక్రియల్ని ఆయా సాహిత్య సభల ద్వారా ప్రచారంలోకి తీసుకు రావచ్చును. ఉపన్యాసాలు చర్చలు మొదలైనవి సాహిత్యాభివృద్ధికి ఎంతైనా దోహదం చేస్తాయి. సమ్మేళనాలవంటి వేదికలపైల రచయితకీ శ్రోతకు ప్రత్యక్ష సంబంధం ఉంటుంది కనుక ఈ సభలూ సమావేశాలూ ప్రజలో సాహితీ సంచలనాన్ని కలిగిస్తాయి — కాని, ఈ సభలూ సమావేశాలూ ఎక్కువైపోయి ఎటువంటి రచన అయినా, అది చదివి వినిపించేయడానికి ఒక వేదిక అంటూ దొరికిపోతే, మజ్జిగ పల్చబడినట్టు "తను రాసిందే మంచి రచన"-అని సంతృప్తిపడి ఎదగడం మానేసే ప్రమాదముంది. కనుక సాహితీ సదస్సులు అధిక సంఖ్యలో ఏర్పాటవుతున్నా, వాటి స్థాయి పడిపోకుండా చూడాల్సిన అవసరం ఎంతైనాఉంది.

ఈ విధంగా సినిమా, రేడియో, పత్రిక, సదస్సులు సాహిత్యానికి ప్రచారసాధనాలుగా ఉపయోగ

పడుతున్నాయి. మొదటే చెప్పాను. సాహిత్యం ప్రచారసాధనాల ద్వారా ఎంతవరకూ ఎలా ప్రచారమౌతోందో, అలాగే ప్రచార సాధనం సాహిత్యాన్ని ఎలా ఉపయోగించుకోవడం అనేది కూడా తెలుసుకోవాలని. ప్రచారసాధనంగా ఉపయోగపడేది ప్రచార సాహిత్యం అవుతుంది వేదాంత ప్రచారం దగ్గర్నుంచి సినిమా ప్రచారంవరకూ, కుటుంబ నియంత్రణ ప్రచారం నుండి రేడియోలో ఎడ్వర్‌టైజ్‌మెంట్‌లోని సాహిత్యంవరకు-అన్నీ ప్రచార సాహిత్యాలే అవుతాయి. అంటే-దేశ కాలానుగుణమైన అవసరాలని ప్రబోధించే సాధనంగా ప్రచార సాహిత్యం ఉంటుంది. ఏదైనా ఒక విషయాన్ని ప్రచారంచేసే సాధనంగా సాహిత్యాన్ని ఉపయోగిస్తున్నప్పుడు గమనించాల్సినవి ఏమిటంటే-ఆ విషయం ఎటువంటిది-ఏ వర్గ ప్రజలకోసం నిర్దేశించబడింది-ఆ వర్గ ప్రజల వాడుకభాష ఏది-అనేవి. ఈ అంశాల్ని గర్తుంచుకుని సాహిత్యాన్ని ఆ విషయానికి ప్రచారసాధనంగా ఉపయోగిస్తే, అది అప్పుడు నిజమైన ప్రచార సాహిత్యం అవుతుంది.

వ్యక్తి తనకు ఉపయోగపడే విధంగా, సమాజానికి ఉపయోగపడే విధంగా రూపొందడానికి ఏర్పరచిన నియమాల్ని నిబంధనల్ని సాహిత్యంగా మలచి, అందంగా ఆకర్షణీయంగా తయారు చేయడం జరిగింది. శాస్త్రంగా కంటే కావ్యంగా అయితే ఆసక్తితో వింటాడు కనుక. రామాయణ భారత భాగవతాలు వంటి వాటిలోని పరమార్థం ఇదే. వాటి ప్రభావం మనిషిమీదా సమాజంమీదా ఎంతలా పడిందో అందరికీ తెలిసిందే. అంటే కవి తన అభిప్రాయాల్ని భావాల్ని ప్రచారం చేసే సాధనంగా సాహిత్యాన్ని ఉపయోగించుకోవడంలో కృతకృత్యుడయ్యాడని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఆ తరువాత తరువాత కూడా ఏదో ఒక విషయాన్ని సమస్యను తీసుకుని దాన్ని నలుగురికి ఏదో ఒక ప్రచారసాధనం ద్వారా అందచేయడం జరుగుతూనే వచ్చింది. వ్యక్తి స్వాతంత్ర్యం, సామాజిక చైతన్యం అనేవి సాహిత్యం ద్వారా తగిన ప్రచారం చేసి సాధించాలనుకుంటే అందులో చాలా వరకు కృతకృత్యులవ్వడం జరిగింది. అయితే వ్యక్తి స్వాతంత్ర్యం, సామాజిక చైతన్యం వచ్చిన ఈనాడు మనంసాహిత్యన్ని ప్రచారసాధనాల్ని ఎలా ఉపయోగించుకుంటున్నాం అంటే-నన్నడిగితే, ఈ విషయంలో ఇంకా కృషి అవసరమనే అనిపిస్తోందంటాను. అందుకు కారణం సాహిత్యానికి ప్రచార సాధనానికీ ఆధారంగా మరొక బలమైనది తోడవటం-అది వ్యాపారం-సాహిత్యం, ప్రచార సాధనాలతో వ్యాపార దృష్టి కలిసిపోవడంతో ఆ రెండింటి స్వరూప స్వభావాలే మారిపోయి ఈనాడు, వ్యాపారంకోసం, ఆర్థిక సంతృప్తికోసం ఆ సాహిత్యాన్ని, ప్రచారసాధనాల్ని వినియోగించుకోవాలనే కోరిక అంతర్గతంగా పెరిగిపోయి, వాతావరణాన్ని కలుషితం చేస్తోంది. సాహిత్యం పెరిగిపోతోంది. రకరకాల ప్రక్రియల్లో రకరకాల రచనలు కోకొల్లలుగా వచ్చేస్తున్నాయి. కాని, అవి చదివినా, చూసినా ఎంత జ్ఞాపకం ఉంటున్నాయి? పఠిత మనస్సులో కాని ప్రేక్షకుడి మనసులోకాని చెరగని ముద్ర వేసుకోగలిగిననాడే నలుగురిముందుకి తెచ్చిన ఆ రచన సార్థకం అవుతుంది లేకపోతే అవి పుస్తకరూపాల్లో ఉన్నా, వాటి విలువ వాటిని చదివే స్వల్పకాలం మాత్రమే ఉంటుంది. కనుక తాత్కాలికమైన లాభాలతో సంతృప్తిపడటం కాకుండా-వాటితోపాటు తమ రచనలకి సార్వజనీనతకూడా ఉండాలి అనే దృక్పథాన్ని రచయితలూ, రచయిత్రులూ ఏర్పరచుకున్ననాడే ప్రచార సాధనాలు-సాహిత్యం పరస్పరం సద్వినియోగమై శాశ్వత స్థానాన్ని పొందగలుగుతాయి.

Source: A.P. Press Academy Website

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/